

# మట్టివాసన

ఎ.రజాహుస్సేన్

మట్టంటే నాకు మొదటినుంచే ఎందుకో తెలియని ఇష్టం. తూర్పున సూరీడు నిద్ర లేవకముందే మా అమ్మ చల్లే నీళ్లకళ్లాపుతో వచ్చే మట్టివాసన నన్ను తట్టిలేపుతుంది. మనిషికీ మట్టికీ ఉన్న సంబంధం ఏమిటో నాకు తెలీని రోజుల్లో కూడా మట్టే నా నేస్తం. పసితనపు నా ఆటపాటల్లో, నేను చేసే అల్లరిచేష్టల్లో మట్టే నా తోడుండేది. బతుకుతెరువు కోసం అమ్మా నాన్న మా ఊరిని వదిలి పట్నం వచ్చాక నా నేస్తం నాకూ దూరమైంది. పట్నంలో సిమెంటు రోడ్ల ధూళి కళ్లల్లో పడినప్పుడల్లా నా నేస్తం గుర్తొచ్చేది. మా ఊర్లో వర్షం పడ్డప్పుడు మట్టివాసనతో ఊరు ఊరంతా ఘుమఘుమ లాడేది. పంటచేలైతే ఒళ్లంతా కళ్లు చేసుకొని వాన చినుకుల సొగసు చూస్తూ పరవశించేవి. చెట్టూచేమలు, గొడ్డూగోదా, బాతులు, పిట్టలు వర్షంలో సరిగంగ స్నానాలు చేస్తూ పాటలు పాడుకునేవి. వర్షం వచ్చిందంటే మా పల్లెకు పండగొచ్చినంత సంబరంగా వుండేది. ఎండకు ఎండి మలమలమాడిపోయే మా నరసింహసామి గుడిమెట్లు వర్షం చినుకులకు తడిసి ముద్దయి సేదతీరేవి. వర్షానికి ముందుదాకా తన దగ్గరకు వచ్చే భక్తుల్ని ఉగ్రంగా చూసే నరసింహసామి వాన రాకతో ఉన్నట్టుండి శాంతస్వభావుడిగా మారిపోయేవాడు. భక్తులు వేసే ధూపాలకంటే నరసింహసామికి మట్టివాసనంటేనే ఇష్టంగా వుండేది. అందుకే వర్షం వచ్చినపుడు సామివారికి ధూపం వేయడానికి ఎవరూ సాహసించేవారు కాదు. మట్టి మా ఊరికి తల్లి, ఆ తల్లి కనికరిస్తే ఊరుఊరంతటికి బువ్వదొరికేది. అందుకే మట్టంటే నాకు పసితనం నుంచీ ఇష్టం.

మా వూర్లో వర్షాలు పడక కరువొచ్చినపుడు జనమంతా మట్టిపని మీదే ఆధారపడేవారు. కరువులో చేసేదేమీ లేక మా నాన్న కూడా నాగలిని పక్కనపడేసి పలుగూ పారా భుజానికెత్తుకొని మట్టిపనికెళ్లే వాడు. సాయంత్రం పనినుంచి తిరిగొచ్చి చేతులూ కాళ్లూ కడుక్కుంటుంటే వచ్చే మట్టివాసనతోనే నా కడుపు నిండిపోయేది. రాత్రికి బువ్వలేదురా గంజి మాత్రమే ఉందని అమ్మ చెప్పినప్పుడు 'నాకు ఆకలిగా లేదమ్మా' అని చెప్పి మట్టివాసనతోనే కడుపునింపుకున్న రోజులు చాలానే వున్నాయి.

ఒకరోజు మా పాడిగేదె పెయ్య చనిపోయింది. మాతోపాటే పెయ్యను కూడా బిడ్డలా సాకింది అమ్మ. పెయ్య చనిపోయిందన్న బాధను అమ్మ జీర్ణించుకోలేకపోయింది. ఆ రోజు బాధతో గేదె తల్లి పాలివ్వడం మానేసింది. గేదెతల్లి రోజు రోజంతా కన్నీరు కారుస్తూనే వుంది. పెయ్య కళేబరాన్ని మా దొడ్డెనకే గుంటతీసి అందులో పూడ్చిపెట్టాడు నాన్న. ఆ రోజు నాన్నచేతులు కడుక్కుంటున్నప్పుడు వచ్చిన మట్టివాసన ఎందుకో వెగటుగా, వికారంగా అనిపించింది. మట్టిపట్ల నాకు కలిగిన వ్యతిరేక భావాల్లో బహుశా ఇదే మొదటిది. కరువొచ్చినప్పుడు గేదెతల్లే మా ఇంటిల్లిపాదిని సాకేది. ఇప్పుడు పెయ్య చచ్చిపోవటంతో పాలిచ్చే గేదెతల్లి మారాము చేసేది. మన కింకా పస్తే అని అమ్మ చెప్పినప్పుడు దూడను తనలో కప్పెట్టుకున్న మట్టిమీద కోపం వచ్చేది.

కాలచక్రం గిర్రున తిరిగి మేమంతా పెద్దవాళ్లమయ్యాం. అమ్మ నాన్నలు ముసలాళ్లయ్యారు. ఓ రోజు అమ్మ రక్తపువాంతులు చేసుకొని కళ్లుమూసింది. అప్పటికిగానీ అమ్మకు క్యాన్సర్ అని తెలీలేదు. పొలంలోనే పెయ్య కప్పెట్టిన కాస్తంత దూరంలో అమ్మను కూడా కప్పెట్టాం. ఇంటికి పెద్దవాడ్ని కావటంతో మొదటిదోసిలి మట్టిని నా చేత వేయించారు. అమ్మ అంత్యక్రియలు పూర్తయ్యాక ఇంటికొచ్చి చేతులు కడుక్కుంటుంటే వచ్చిన మట్టివాసన ఎవరో కడుపులో చేయిపెట్టి కలియబెట్టినంత వికారంగా వుండింది. కనిపెంచి కళ్లల్లో పెట్టుకుని సాకిన అమ్మను తనలో ఇముడ్చుకున్నందుకు మట్టిపై నాకు విపరీతమైన ద్వేషభావం ఏర్పడింది. ఆ తర్వాత మట్టి అన్నా.. మట్టి వాసన అన్నా నాకెందుకో అసహ్యం వేసేది. అమ్మ మట్టిలో కలిసిపోయి ఏడాది దాటిపోయింది. రంజాన్ పండగకు అమ్మ సమాధిని చూద్దామని వెళ్లాను. సమాధి భూమిలో కుంచించుకుపోయి వుంది. సమాధిపై పగుళ్లు, అక్కడక్కడా పిచ్చి మొక్కలు పెరిగివున్నాయి. వాటిని పెరికేస్తుంటే అమ్మ తలభాగంలో ఒక తెల్ల గులాబిమొక్క కనబడింది. చలికాలం కావటంతో ఆకులపై మంచుబిందువులు సూర్యకాంతికి ముత్యాల్లా మెరిసిపోతున్నాయి. ఒక్కొక్క బిందువు ఆకుపై నుంచి జారి సమాధిలో పడుతుంటే అమ్మ దాహాన్ని తీరుస్తున్నాయా అనిపించింది.

గులాబి మొక్క ఒక పక్క మొగ్గ విచ్చుకుంటోంది. అమ్మే నన్ను చూసి పిలుస్తున్నట్లుగా వుంది ఆ దృశ్యం. మట్టిపై నాకున్న హేయభావానికి సిగ్గుతో తలదించుకున్నాను. కొడుగ్గా నేను చేయలేనిది మొక్కకు జన్మనిచ్చి మట్టి మా అమ్మకు సేదతీరుస్తోంది. సేవలు చేస్తోంది. రెండు చేతుల్తో అమ్మ సమాధిని తడిమాను. అమ్మ నన్నెత్తుకొని ముద్దాడినపుడు కలిగిన ఆనందం కలిగింది. అమ్మచేతి స్పర్శను మళ్లీ అనుభవించాను. ఈ అనుభూతిని నాకందించిన మట్టి తల్లికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ చెమ్మగిల్లిన కళ్లతో ఇంటికెళ్లాను. మా అబ్బాయి చెంబునీళ్లతో ఎదురుగా వచ్చాడు. వాడు నీళ్లు పోస్తుంటే నేను చేతులు కడుక్కుంటున్నాను. అప్పుడు వచ్చిన మట్టివాసన మా ఇంట్లో ఇప్పటికీ అలాగే వుంది. అమ్మే మట్టివాసనగా రోజూ మమ్మల్ని ఆశీర్వదిస్తున్న అనుభూతి కలుగుతోంది. ఇప్పుడు మట్టివాసన మా జీవితాల్లో ఒక భాగమైపోయింది.

సింగిల్ పేజి కథ